భారతీయ సంగీతం - వైశిష్ట్యం

మానవ సంస్కృతి వికాస చరిత్రలో... సంగీతం, నాట్యం, చిత్రలేఖనం, శిల్పం, కవిత్వం.. లలిత కళలుగా పేరుగాంచాయి. లలిత కళలను మళ్లీ రెండు రకాలుగా విభజించారు. శిల్పం, చిత్రలేఖనం.. స్థిర కళలని; సంగీతం, కవిత్వం.. చర కళలని పేర్కొన్నారు. నాట్యాన్ని.. సమాహార కళ అంటారు. కళలు.. దృశ్య కళలని; శ్రావ్య కళలని రెండు విధాలు. చూసి ఆనందించేది.. దృశ్యకళ ; విని ఆనందించేది శ్రావ్యకళ. సంగీతం.. శ్రావ్యకళ!!



భారతీయ సంగీతం శ్రేష్టమైంది.. సర్వోత్తమైంది. 'శ్రుతి', 'లయ'ల మేళవింపే సంగీతం. సృష్టికి అదే ఆధారం. ప్రతి ప్రాణి నడుస్తున్నా.. కూర్చున్నా.. రెప్ప వేసినా.. అది సంగీతమే అవుతుంది. రాగం తప్పకుండా పాడితే సంగీతం వీనులవిందుగా ఉంటుంది. సంగీతం అంటే.. సప్తస్వరాలు. ప్రపంచంలోని అన్ని సంగీతాలకు భారతీయ సంగీతమే మూలం. హిందూస్థానీ, కర్ణాటక, పారశీక, పాశ్చాత్యం.. ఇలా ఏ సంగీతాన్ని పరిశీలించినా.. అవన్నీ భారతీయ సంగీతంలో భాగమేనన్న విషయం సుస్పష్టం.

మేధస్సుకు వికసింపచేస్తుంది. మనస్సు తేలిక పడుతుంది. కన్నీరును తెప్పిస్తుంది. లయ, తాళ, విన్యాసాలతో మాధుర్యం విస్పష్టంగా వినిపిస్తుంది.ఆరోహణ- అవరోహణ, 'గమకాల'తో కింది నుంచి-పైకి తరంగాలు పుట్టిస్తుంది. మనిషి మూల చక్రంలో 'శబ్దం' ఉంది.

ఇక్కడి నుంచే 'నాదం' పుడుతుందని విజ్ఞుల అభిప్రాయం. అందుకే మన ప్రాచీన శాస్త్రాల్లో... 'నాదోపాసన' వివరణ ఉంది. భారతీయ సంగీతం 'సామవేదం' నుంచి ఆవిర్భవించిందనీ.. మహాదేవుడు తన చేతిలోని 'ఢమరుకం' ద్వారా.. సంగీతంలోని 'లయను' కాపాడునట్లు.. బ్రహ్మ-విష్ణువులు భారతీయ సంగీతానికి ప్రవర్తకులనీ... భారతదేశంలో పారంపర్యంగా చెబుతున్నారు. సంగీతాన్ని శాస్త్రీయ పద్ధతుల్లో 'శ్రుతి', 'లయ', 'తాళం' గతులు తప్పకుండా ఆలపిస్తే... మోక్షాన్ని పొందవచ్చని 'యాజ్ఞవల్క్యస్మృతి' చెబుతుంది. సారంగ దేవుని 'సంగీత రత్నాకరం' గ్రంథంలో.. 'ఆలాపన, రసార్ణవ, స్వరార్ణవ' వివరాలున్నాయి. 'రత్నాకరం'అంటే... సముద్రం. సముద్రంలో మనకు రత్నాలు, ముత్యాలు లభ్యమౌతాయి. 'సముద్రం' అంటే... 'అనంతం' అనే అర్థం కూడా ఉంది. అందుకే సారంగ దేవుడు... సంగీత రత్నాకరమని తన గ్రంథానికి పేరు పెట్టాడు. ఇది కాకుండా.. 'సంగీత సమయాసార, సంగీత కౌముది, సంగీత నారాయణ, సంగీత సారణి, సంగీత కామద, సంగీత దామోదర, సంగీత భాస్కర, సంగీత సాగరం' వంటి గ్రంథాలు వివిధ భాషల్లో వెలువడ్డాయి.

సంగీతం- నిశ్శబ్దం :

సంగీతం నిశ్శబ్దంలో పుట్టి, తిరిగి నిశ్శబ్దంలోనే అంతం అవుతుందని.. 'గ్రీనెల్ బెల్' అనే శాస్త్రజ్ఞుడు అభిప్రాయపడ్డాడు. సంగీత కచేరి ప్రారంభించడానికి ముందు ఉండేది నిశ్శబ్దమే! నిశ్శబ్దమే.. సంగీతాన్ని సృష్టిస్తుంది. నిశ్శబ్దమే.. సంగీతాన్ని అంతం చేస్తుంది. సంగీతానికి ఇరువైపులా నిశ్శబ్దమే ఉంటుంది. 'గాత్రం' ఆగినా.. జంత్రం నిలిచినా.. సంగీతం ఆగిపోతుంది. తిరిగి నిశ్శబ్దమే ఆవరిస్తుంది. సంగీతాన్ని విని, చిరకాలం దాన్ని మనస్సులో స్మరించినపుడే అది ఉత్తమ సంగీతం. 'కళ' పరమావధి ఆనందం. అది సంగీతం వల్ల లభ్యమౌతుంది. మన ప్రాచీనులు సంగీతానికి ప్రముఖ స్థానాన్ని ఇచ్చారు. సంగీతానికి కులం, మతం, వర్గం, వర్ణం, దేశం, ఎల్లలూ లేకుండా విశ్వజనీయతను సృష్టించింది. భారతీయ తాత్విక చింతన, అంతఃకరణ శక్తి, ఆధ్యాత్మికత ముఖ్యమైనవి. అందువల్ల భారతీయ-సంగీత వికాస పరిణామ క్రమంలో.. ఎన్నో మార్పులు జరిగినా.. సంగీతానికి సుస్థిర స్థానముంది. తిరుగులేని ప్రజాదరణ ఉంది. సంగీతం కాల ప్రధానమైంది. ధ్వని అంతా సంగీతం కాదు. కాని సంగీతం అంతా ధ్వనే! రాత్రింబవళ్లు మనకు అనేక ధ్వనులు వినిపిస్తాయి. ఇవన్నీ సంగీతం కావు. 'ధ్వని' ముడిపదార్థం వంటిది. దాన్ని 'లయ' సహాయంతో.. కాల, మాన గతిని అనుసరించి సంగీతంగా పరివర్తన చేయవచ్చని ప్రముఖ రచయిత, కళా విమర్శకుడు డాక్టర్ సంజీవదేవ్ పేర్కొన్నారు.

భారతీయ సంగీతం-పరిణామం :

భారతజాతి-సంస్కృతి ఎంత ప్రాచీనమైందో.. సంగీతం- నాట్యకళలు కూడా అంత ప్రాచీనమైనవే. భారతీయ సంగీతానికి మూలం వేదాలే! వేదాలలోని స్వరాలు.. కన్యాకుమారి నుంచి హిమాలయాల వరకూ ఒకటే!! బేధం అంతా పాడడంలోనే ఉంటుంది. 'రుగ్వేదం' మంత్రాల గురించి వివరిస్తుంది. మొదట్లో మంత్రాలకు కొన్ని లయాత్మక పదాలు చేర్చి పాడేవారు. వీటినే 'స్తోభాలు' అంటారు. రుగ్వేద కాలంలో.. ఉదాత్త, అనుదాత్త, స్వరిత అనే స్వరాలు ఉచ్చరించేవారు.

కాలక్రమేణా వీటిని ఉచ్చ, వచ, స్వర, విశిష్టలతో సృష్టించారు. ఈ విధానం కొంతకాలం కొనసాగి, ఏకస్వరమైన(ఆర్చిక) పఠనంగా మారింది. ఉచ్చా, వచ, స్వర-స్వరానికి (సామిక) - ఈ విధంగా వేద కాలంలో పఠనం జరిగేది. యజ్ఞయాగాలు జరిపే సమయంలో.. హోత, ఉద్గాత, సామిక అనే పేర్లతో.. 'స్వరాలను' పాడేవారు. వేదకాలంలో ఏక(ఆర్చిక), ద్విస్వరాలు (గాధిక్యం), దిస్వర(సామిక) పేర్లతో రూపొందింది. కాలక్రమేణా 'చతుస్వరి' (నాలుగు), పంచస్వరి (ఐదు), షట్స్వరి (ఆరు), సప్తస్వరి (ఏడు)గా మారాయి. కాలక్రమంగా 'సప్తస్వర' యుక్తమైన ఒక స్థాయిని మన పూర్వీకులు అందించారు. సామవేదం భారతీయ సంగీతానికి మూలం. ఇందులో ఏడు నుంచి పది స్వరాలు, సంగతులున్నాయి. అవి: వికార, విశ్లేష, వికర్షణ, అభ్యాస, విరామ, స్తోభాలు మొదలైనవి. అవి ఈనాటికి సంగీతంలో 'గమకాలు'గా ఉంటాయి. మరికొంత కాలానికి సంగీతంలో 'వాది'-'సంవాది',ఆరోహణ-అవరోహణ (మంద్ర తారా స్థాయిలు) ప్రక్రియ లొచ్చాయి. సామవేదానికి, గంధర్వవేదం ఉపవేదంగా పేర్కొంటారు.

భారతీయ సంగీతం -ప్రకృతి:

భారతీయ సంగీతానికి ప్రకృతితో అవినాభావ సంబంధముంది. అందుకే 'చైతన్యం-సర్వభూతనం' అని అన్నారు. నారద పరి వ్రాజక ఉపనిషత్తు.. 'సప్తస్వరాలు' గురించి ఇలా పేర్కొంది...

సప్తస్వరాలు-మూలాలు :

1. (స) షడ్జ స్వరం- (నెమలి అరుపు)
   (Cry of the Peacock)
2. (రి) రిషభ స్వరం - (ఎద్దు అరుపు)
   (The Lowing of the Bull)
3. (గ) గాంధార స్వరం - (మేక అరుపు)
   (The Bleating of the Goat)
4. (మ) మధ్యమ స్వరం - (కొంగ అరుపు)
   (The Cackle of the Heron)
5. (ప) పంచమ స్వరం - (కోయలకూత)
   (The Trill of the Coel)
6. (ద) దైవతం స్వరం - (గుర్రం సకిలింపు)
   (The Neighing of the Horse)
7. (ని) నిషధ స్వరం - (ఏనుగు ఘీంకారం)
   (The Trumphing of the elephant)

వీటినే మనం ఇప్పుడు- స, రి, గ, మ, ప, ద, ని, లని అంటున్నాం. వీటిని విధిగా పాటించినట్లయితే.. సంగీతం ఔన్నత్యం పెరుగుతుంది. వేదాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు, జైమినీ భాష్యాలు... నృత్య, గీత, వాయిద్యాల గురించి వివరించాయి. రుగ్వేదం ఉదాత్త, అనుదాత్త, స్వరిత స్వరాలను గురించి వివరిస్తే... అధర్వణ వేదం- తాళాలు, తప్పెటలు గురించి చెబుతుంది. సంగీతం వల్ల 'ఆత్మ' ఆనందిస్తుందనీ.. 'చాంధోగ్యోపనిషత్' పేర్కొంటుంది. వేదకాలంలో.. యజ్ఞాలు నిర్వహించినపుడు గృహస్థులు వివిధ స్వరాలు, వాయిద్యాలతోపాటు పాటలు పాడేవారని వివరణలున్నాయి. ఉదాహరణకు ఈ వాయిద్యా లను చూడండి.

1. గోధావీణక
2. వీణ
3. నాడి (పైపు)
4. తునవ (కర్ర మురళి)
5. శంఖం
6. అగితి (తాళాలు)
7. అఢఘట తిలక
8. ఘటకారిక
9. తబుక వీణ
10. పాంచాల వీణ

'మార్గ-దేశి' సంగీతం:

పూర్వకాలంలో సంగీతాన్ని 'మార్గ-దేశి','గాంధర్వ' సంగీత మని పేర్కొన్నారు. 'మార్గ' సంగీతం అంటే.. శాస్త్రీయమైందని, మార్గదర్శకమైంది అని అర్థం. 'దేశి' సంగీతం అంటే.. ఒక దేశం లేదా ప్రాంతం సంగీతమని అర్థం. గాంధర్వ సంగీతం వ్యాకరణ పూరితమైంది. భారతీయ సంగీతం అనగానే మనకు సారంగదేవుడు, భరతుడు, మాతంగుడు, కాశ్యపుడు, రామా మాత్యుడు, తాన్‌సేన్, స్వామీ హరిదాస్, త్యాగరాజు, ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి, స్వాతి తిరునాళ్, పురంధర దాసు వంటి మహా వాగ్గేయకారులు గుర్తుకు వస్తారు. వీరందరూ మార్గ-దేశి, గంధర్వ సంగీత విభజన, రాగాలు, స్వరాలు, తాళాలు, వాయిద్యాలను గురించి విపులంగా చర్చించారు.

నిబద్ధ - 'అనిబద్ధ' సంగీతాలు:

నిబద్ధ, అనిబద్ధ సంగీతమని రెండు విధాలు. 'తాళ' నిబద్ధం కలది-నిబద్ధ సంగీతం. 'తాళ' నిబద్ధం కానిది అనిబద్ధ సంగీతం. కర్ణాటక సంగీత పద్ధతిలో ఆలాపన, తానం, మొదలైనవి... అనిబద్ధ సంగీతం. అష్టపదులు, కీర్తనలు, పదాలు, కతులు, భజనలు, వర్ణాలు, సంగతులు, కల్పనా స్వరాలు' తదితరాలు నిబద్ధ సంగీతం. హిందూస్థానీ సంగీతంలో.. ఆలవ్, తాన్, బోల్‌తాన్, జోడ్ అనిబద్ధ సంగీతాలు. ఘరానాలు, భజనలు, టుమ్రీలు, నిబద్ధ సంగీతాలు. వేద వాఙ్మయం తర్వాత పురాణాలు, ప్రబంధాలు, వివిధ కాలాల్లో వెలసిన చిత్ర-శిల్ప, సాహిత్యాలలో... భారతీయ సంగీత ప్రస్తావన ఉంది. ఉత్తర రామాయణంలో 'లవ-కుశలు' రామాయణాన్ని గానం చేయడం.. మహాభారతంలో అర్జునుడు 'ఉత్తర'కు సంగీత-నాట్యాలు నేర్పించడం.. భాగవతంలో శ్రీకృష్ణుని వేణుగానం.. మనందరికీ తెలిసిందే. బౌద్ధ-జైన -హిందూ శిల్ప కళా రూపాల్లో.. యక్ష-యక్షణీలు వివిధ వాయిద్యాలను వాయిస్తున్నట్లు శిల్పాలు చెబుతాయి.

సాహిత్యాలు :

హాలుని 'గాథాసప్తశతి'.. గుణాఢ్యుని 'బృహత్కథ'.. వాత్స్యాయుని 'కామసూత్రాలు'.. తదితర గ్రంథాలలో సంగీత- నాటక-నాట్య-చిత్రలేఖనాల గురించి వివరాలున్నాయి.